నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 4-5-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:216 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

భాసిల్లు చున్న శుక్రుని
ఊసులు తెలియంగ గోరి యుత్సాహముతో
నాసా ఈ దినముననే
చేసెను-మెగలాను పంపి-చిరు యత్నంబున్

(4-5-1989 నాసా శుక్రుడి మీదకు వ్యోమనౌక మెగలాన్ ను పంపిన రోజు)

-రాధశ్రీ
సెల్:9494481210

చురక

పత్రికా స్వేచ్ఛకిపుడు
ప్రబలంగా సంకెళ్లు
నాలుగవ స్తంభమైనా
నలుగుటేలా ఇన్నేళ్లు
మనం విశ్వ సూచీలో
మెరుగుపడని దుస్థితి
ప్రజాస్వామ్య భారత్ లో
ప్రమాదంగా పరిస్థితి

-వేల్పుల నారాయణ
9440433475

తొలి క్వార్టర్ లో బొగ్గు ఉత్పత్తి టార్గెట్ 160 లక్షల టన్నులు

- టార్గెట్ నిర్దేశించిన సింగరేణి సిఎండి బలరామ్

-1200 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించాలి
-సమీక్ష సమావేశంలో సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎన్.బలరామ్

హైదరాబాద్, మే 3: ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తికి పూర్తిగా అనుకూలంగా ఉండే మొదటి త్రైమాసిక కాలాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటూ 160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని, 1200 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించాలని సింగరేణి సంస్థ ఛైర్మన్ , ఎండీ ఎన్.బలరామ్ ఏరియాల జనరల్ మేనేజర్ లను ఆదేశించారు.

హైదరాబాద్ సింగరేణి భవన్ లో నేడు జరిగిన అన్ని ఏరియాల సమీక్ష సమావేశంలో ఆయన ఉత్పత్తి, బొగ్గు రవాణా తదితర అంశాలపై సమీక్షించారు. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో సాధించిన బొగ్గు రవాణా 5.66 మిలియన్ టన్నులపై 2.7 శాతం వృద్ధితో ఈ ఏప్రిల్ లో 5.81 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా సాధించామని, అలాగే గత ఏడాది ఏప్రిల్ నెలలో సాధించిన 36.18 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ పై 10.6 శాతం వృద్ధితో ఏప్రిల్ లో 40 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబి తొలగించామని, ఇదే ఒరవడిని కొనసాగిస్తూ లక్ష్యాలు సాధించాలని ఛైర్మన్ సూచించారు.

ఒడిశా రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాకులో పనిచేసేందుకు సూపర్వైజర్ సిబ్బందిని ఎంపిక చేసి నెల రోజుల్లోగా అక్కడికి పంపించాలని ఆదేశించారు. కొత్తగా నియమించిన ఉద్యోగులను భూగర్భ గనుల్లో పనిచేసే విధంగా పోస్టింగులు ఇవ్వాలని కోరారు. సింగరేణి సంస్థలో మహిళా ఉద్యోగినిల సంఖ్య పెరిగిన రీత్యా వీరి నిర్వహణలో నడిపించడానికి ఒక ఓపెన్ కాస్ట్ గనిని , ఒక భూగర్భ గనిని ఎంపిక చేయాలని సూచించారు. ముందుగా ఒక పూర్తి పిష్టును కేవలం మహిళలు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

బొగ్గు రవాణా , నాణ్యతపై కూడా ఆయన సమీక్షించారు. నాణ్యత సరిగా లేనట్లయితే బొగ్గు అమ్మకాలు కుంటుబడతాయని, వినియోగదారులు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. కనుక నాణ్యతపై కిందిస్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా పూర్తి పనిగంటలు సద్వినియోగం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ (పీపీ మరియు పర్సనల్) కె.వెంకటేశ్వర్లు, జీఎం (సీపీపీ) శ్రీ ఎ.మనోహర్, అడ్వైజర్ ఫారెస్ట్రీ మోహన్ చంద్ర పరిగెన్, జీఎం మార్కెటింగ్ రాజశేఖర రావు, కార్పొరేట్ జీఎం లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

నా మిత్రుడు చంద్రబాబు దార్శనికతకు ప్రత్యేక అభినందనలు - మోదీ

న్యూఢిల్లీ, మే 3: అమరావతి పనుల పునఃప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషంగా ఉందంటూ ప్రధాని మోదీ ట్విట్ చేశారు?అమరావతి పర్యటనను ముగించుకుని ఢిల్లీ వెళ్లిన అనంతరం 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. "అమరావతి అభివృద్ధిలో నూతన, చరిత్రాత్మక అధ్యాయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్లోని నా సోదర, సోదరీమణుల మధ్య ఉండటం ఆనందంగా ఉంది. అమరావతి భవిష్యత్ పట్టణ కేంద్రంగా ఆవిర్భవిస్తుందని, ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథాన్ని మెరుగుపరుస్తుందని నేను విశ్వసిస్తున్నాను. నాకు మంచి మిత్రుడు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు అమరావతి పట్ల ఉన్న దార్శనికత, ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమం పట్ల ఆయనకున్న నిబద్ధతను అభినందిస్తున్నాను'' అని మోదీ పేర్కొన్నారు.

రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా అమరావతిని నిర్మిస్తాం - చంద్రబాబు

రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమం విజయవంతంపై ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు, భాగస్వామ్య పక్షాలకు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరిగిన రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలకు, రాజధాని రైతులకు, కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ప్రభుత్వ యంత్రాంగానికి, అధికారులకు, మంత్రులకు, ప్రజాప్రతినిధులకు, కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లిన మీడియా, సోషల్ మీడియా వారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాను. ప్రజల సహకారంతో, కేంద్ర మద్దతుతో, పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా ఫ్యూచర్ సిటీగా రాజధాని అమరావతిని నిర్మిస్తాం. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించి, మాకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతాం అని తెలుపుతూ ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

తెలంగాణలో ఓ వైపు భారీ ఎండలు..దంచికొడుతున్నవర్షాలు

హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో వడగండ్లతో కూడిన భారీ వర్షం
వర్షం కురిసిన ప్రాంతాల్లో తీవ్రంగా ట్రాఫిక్ జామ్

హైదరాబాద్ మే 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణలో ఓ వైపు ఎండలు దంచికొడుతున్నాయి. అదే సమయంలో మరికొన్ని జిల్లాల్లో ఈదురుగాలులతో వర్షాలు కురుస్తున్నాయి. దాంతో రాష్ట్రంలో భిన్న వాతావరణం ఏర్పడుతున్నది. పొద్దంతా ఎండలు దంచికొడుతుండగా.. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి వర్షం కురుస్తున్నది. మరో రాబోయే రెండురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పులు ఉండవని.. ఆ తర్వాత గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయని వాతావరణశాఖ తెలిపింది. అదే సమయంలో రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

కాగా నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం భారీగా వర్షం కురిసింది. ముషీరాబాద్, చిక్కడపల్లి, ఆర్టిసి క్రాస్ రోడ్, బాగ్ లింగంపల్లి, రామ్ నగర్, విద్యానగర్, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, ప్యాట్నీ, ప్యారడైజ్, నాగారం,నాచారం, చంగిచ్చరల, ఉప్పల్ ,తార్నాక,ప్రాంతాల్లో వర్షం నాగోల్ ఎల్ బి నగర్ తదితర ప్రాంతాలో భారీగా వర్షం కురిసింది. నగరంలోని పలు ప్రాంతాలు మేఘావృతమై ఉన్నాయి. ఈదురుగాలులు బలంగా వీస్తున్నాయి. వర్షం కురిసిన ప్రాంతాల్లో తీవ్రంగా ట్రాఫిక్ జామ్ అయింది.

ఈ క్రమంలో పలు జిల్లాలకు ఆరెంజ్, మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. శనివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడుతాయంటూ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. ఆదివారం రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది.

అలాగే, మంచిర్యాల, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజ్‌గిరి, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. ఈ నెల 5న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే, మంగళవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లోనూ వానలు కొనసాగుతాయంటూ పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసిందని హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం.

కాంగ్రెస్ ఒత్తిడితోనే కేంద్రం కులగణన -డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం, మే 3: కాంగ్రెస్ ఒత్తిడి చేయడం వల్లే కేంద్రం కులగణన చేసేందుకు నిర్ణయించిందని, ఇది రాహుల్ గాంధీ సాధించిన విజయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండల పరిధిలోని మల్లన్నపాలెం గ్రామంలోని రామలింగేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ అభివృద్ధి పనులకు ఇవాళ ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియా మాట్లాడుతూ? తెలంగాణలో కులగణన చేసి దేశానికి రోల్ మోడల్‌గా నిలిచామన్నారు. ప్రభుత్వం నిర్ణయాల్లో కులగణనను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. కులగణన సర్వే ఫలితాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపిచ్చారు.

అదేవిధంగా ప్రభుత్వానికి బీసీలు ఎల్లప్పుడూ అండగా ఉండాలని కోరారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా సామాజిక అసమానతలు తొలగించడానికి దేశవ్యాప్తంగా కులగణన చేయాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు.

కులగణన ఆధారంగా బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామన్నారు. కులగణన చేపట్టాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్నా.. పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు ప్రజల ఒత్తిడికి తలొగ్గి అందుకు ఒప్పుకుందని తెలిపారు. రాష్ట్రంలో తాము నిర్వహించిన కులగణనను ఇన్నాళ్లు అపహాస్యం చేసిన బీజేపీ ఇప్పుడు తమ దారిలోకి రావడం సంతోషకర పరిణామమని భట్టి అన్నారు.

శిర్డాన్‌లోని లైరాదేవి ఆలయంలో తొక్కిసలాట.. ఆరుగురు భక్తులు మృతి

తిరువనంతపురం మే 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: గోవాలో విషాదం చోటుచేసుకున్నది. శిర్డాన్‌లోని లైరాదేవి ఆలయంలో తొక్కిసలాట జరిగింది. దీంతో ఆరుగురు భక్తులు మృతిచెందగా, మరో 50 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. లైరా దేవి ఆలయంలో ఏటా వైశాఖ శుద్ధ పంచమి రోజు వైభవంగా జాతర జరుగుతుంది.

ఈ నేపథ్యంలో భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట చోటుచేసుకున్నది. ఆలయ సిబ్బంది, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని హుటాహుటిన దవాఖానకు తరలించారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు.కాగా, తొక్కిసలాట జరగడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. అయితే ప్రాథమిక సమాచారం మేరకు అధికసంఖ్యలో భక్తులు రావడంతోపాటు వారిని నియంత్రించడానికి సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం.

12 ఎకరాల ఆక్రమణ భూమి స్వాధీనం ..అధికారులకు పొన్నం అభినందనలు

హైదరాబాద్, మే 3: ప్రభుత్వ భూమి కబ్జాకు గురైతే అధికారులకు సమాచారం ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్ లో కబ్జాకు గురైన 12 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ స్థలాన్ని శనివారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రెవెన్యూ అధికారులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ భూమికి ఫెన్సింగ్ వేసే విషయంలో అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ భూమిని కాపాడిన కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్ ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

తండ్రి కంట నీరు రాకుండా విద్యార్థులు ఉన్నతంగా చదవాలి : కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదరాబాద్, మే 3: తండ్రి కంటనీరు రాకుండా వారి ఆశయ సాధన కోసం ఉన్నతంగా చదవాలని విద్యార్థులకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని రాజరాజేశ్వరి నగర్‌లోని రెయిన్‌బో హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా పదో తరగతి ఫలితాల్లో 581 మార్కులతో మండల టాపర్ గా నిలిచిన ఎస్.రిషితకు రూ.10 వేలు నగదు ప్రోత్సాహకంగా పాఠశాల యాజమాన్యం అందజేసింది. రెండో టాపర్‌గా నిలిచిన జ్యోతిక, ప్రజ్ఞలకు రూ.5వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేసింది. అనంతరం టాపర్‌గా నిలిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. 2024 ? 25 సంవత్సరంలో ఓల్డ్ బోయిన్‌పల్లిలోని రెయిన్‌బో స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచారని ప్రశంసలు కురిపించారు. విద్యార్థుల ప్రతిభ తల్లిదండ్రులకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందని అన్నారు. తల్లిదండ్రులు కాయకష్టం చేసి తన పిల్లలను చదివిస్తున్న సందర్భంలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడం వారి జీవితాలకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ జీవితాలను నెరవేర్చుకోవాలని సూచించారు.

పవర్ లిఫ్టింగ్ సాధనతో దేహదారుఢ్యం

పవర్ లిఫ్టింగ్ సాధనతో దేహదారుఢ్యం లభించడం ఖాయమని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని భాగ్యశ్రీ గార్డెన్‌లో ఏర్పాటుచేసిన పవర్ లిఫ్టింగ్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటి యువత సమయాన్ని వృథా చేయకుండా వ్యాయామం చేయడం ద్వారా దేహదారుఢ్యం పెంపొందించుకోవడం ఎంతో అవసరం అన్నారు.

రహదారులు అభివృద్ధి చెందినప్పుడే పెట్టుబడులు వస్తాయి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్ మే 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: రహదారులు అభివృద్ధి చెందినప్పుడే పెట్టుబడులు వస్తాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. భారత్ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం పదేళ్లుగా జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రహదారుల అనుసంధానం అన్నింటికంటే ముఖ్యమైనదని చెప్పారు. వాజ్ పేయీ హయాంలో స్వర్ణ చతుర్భుజి పథకాన్ని తెచ్చారని, రోడ్ల నిర్మాణంపై లక్షల కోట్లు ఖర్చు ఎందుకని ఆనాడు కొందరు విమర్శించారని అన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చాక రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేసిందని, కనెక్టివిటీ కోసం మోడీ ప్రభుత్వం ఎక్కువ నిధులు ఖర్చుపెడుతోందని పేర్కొన్నారు. పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్న అన్ని ప్రాంతాలకు రహదారులు నిర్మిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్- శ్రీశైలం మధ్య ప్రయాణ సమయం తగ్గించేలా రోడ్లు నిర్మాణం జరుగుతుందని తెలియజేశారు. హైదరాబాద్- విజయవాడ మధ్య ఆరు లైన్ల రహదారికి యత్నిస్తున్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

ఆలయాల అభివృద్ధికి సహకారమందిస్తా : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

హైదరాబాద్, మే 3:మన్సురాబాద్ డివిజన్ జడ్జెస్ కాలనీ ఫేస్-1 లో త్వరలో పునరుద్ధరించనున్న శ్రీ ఎల్లమ్మ, బంగార పోచమ్మ దేవాలయ నిర్మాణ పనుల పోస్టర్‌ను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జడ్జెస్ కాలనీ ఫేస్ -1 లో నిర్మించనున్న దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

గ్రామదేవతల ఆలయాల పునరుద్ధరణకు కాలనీవాసులు ముందుకు రావడం ఎంతో అభినందనీయ మన్నారు. ఆలయాల అభివృద్ధితో కాలనీలో ఆధ్యాత్మికమైన వాతావరణం నెలకొంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంజయ్య గౌడ్, బాలయ్య, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత.. మోదీతో ఒమర్ అబ్దుల్లా తొలి భేటీ

న్యూఢిల్లీ, మే 3:జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శనివారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించిన తర్వాత వారిద్దరూ భేటీ కావడం ఇది తొలిసారి.

ప్రధాని నివాసంలో జరిగిన ఈ సమావేశం సుమారు 30 నిమిషాలపాటు కొనసాగినట్లు సమాచారం. పహల్గామ్ ఉగ్రదాడి, జమ్ముకశ్మీర్‌లో అనంతర పరిస్థితులపై మోదీ, ఒమర్ అబ్దుల్లా చర్చించినట్లు తెలిసింది.

కాగా, పహల్గామ్ దాడి తర్వాత సీమాంతర ఉగ్రవాదానికి మద్దతిస్తున్న పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ పలు చర్యలు చేపట్టింది. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. అట్టారిలోని ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్‌ను మూసివేసింది. హై కమిషన్ల సిబ్బందిని తగ్గించింది. పాక్ జాతీయులకు అన్ని రకాల వీసాలను రద్దు చేసింది. ఏప్రిల్ 30 నాటికి వారు పాకిస్థాన్ తిరిగి వెళ్లిపోవాలని ఆదేశించింది.

మరోవైపు పాకిస్థాన్ విమానాలకు భారత గగనతలాన్ని మూసివేసింది. ఆ దేశ కార్గో నౌకలకు భారత జలాలు, పోర్టుల్లోకి ప్రవేశాన్ని నిషేధించింది. పాకిస్థాన్ నుంచి ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులను నిలిపివేసింది. అన్ని రకాల వెయిల్స్, పార్సిల్స్‌ను నిషేధించింది. పాక్ ప్రధాని, ఆ దేశ మీడియాతోపాటు పలువురి యూట్యూబ్ ఛానల్స్, సోషల్ మీడియా ఖాతాలను భారత్‌లో నిలిపివేసింది.

పలు సవాళ్లను ఎదుర్కొంటున్న బొగ్గు గని కార్మికులు

(04 మే "జాతీయ (భారతీయ) గని కార్మికుల దినోత్సవం" సందర్భంగా)

ప్రపంచంలోనే చైనా తర్వాత రెండవ అతి పెద్ద బొగ్గు ఉత్పత్తి చేస్తున్న దేశంగా భారత్ నిలుస్తున్నది. ఏడాదికి 700 మెట్రిక్ టన్నుల బొగ్గును భారత ఉత్పత్తి చేస్తున్నది. మన దేశంలో విద్యుత్తు రంగం, స్టీల్ పరిశ్రమలు, స్పాంజ్ ఐరన్ పరిశ్రమలు, సిమెంట్ పరిశ్రమలు అధిక మొత్తంలో బొగ్గును వినియోగిస్తున్నాయి. భారత్‌లో ఉత్పత్తి చేసే బొగ్గు నాణ్యత తక్కువగా ఉండడంతో స్టీల్ పరిశ్రమలకు విదేశాల నుంచి నాణ్యమైన బొగ్గును దిగుమతి చేసుకోవడం జరుగుతున్నది. బొగ్గు గనుల్లో అతి ఇరుకైన ప్రమాదకర పరిస్థితుల్లో పని చేస్తున్న గని కార్మికుల తక్కువ వేతనాలకే పని చేయడం, త్యాగం, అంకితభావం, అనారోగ్యాల బారిన పడుతున్న గని కార్మికుల కృషిని అభినందించడం, ఎక్కువ పని గంటలు కేటాయించడం, వారికి పౌర సమాజం సంఘీభావం తెలపడం లాంటి అంశాలను లేదా సవాళ్ళను చర్చించడానికి ప్రతి ఏట 04 మే రోజున "జాతీయ లేదా భారతీయ గని కార్మికుల దినోత్సవం (నేషనల్ లేదా ఇండియన్ కోల్ మైనర్స్ డే" నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

భారత్‌లో బొగ్గు గని చరిత్ర:

గని కార్మికపు బొగ్గు గనుల్లో పని చేయడం తొలుత చైనా, రోమన్ సామ్రాజ్యంలో ప్రారంభం అయ్యింది. పారిశ్రామిక విప్లవ సమయంలో బొగ్గును స్టీమ్ ఇంజన్, విద్యుత్తు ఉత్పత్తి, ఉ?ష్ణ భవనాల్లో బొగ్గు వాడడం ప్రారంభం కావడంతో బొగ్గు గని కార్మికుల అవసరం ఏర్పడింది. 1774లో భారత్‌లో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రారంభించిన బొగ్గు నేటి వరకు కొనసాగుతున్నది. 1

850ల్లో సాలీనా ఒక మిలియన్ మెట్రిక్ టన్ను బొగ్గు ఉత్పత్తి చేయడంతో ఇండియాలో బొగ్గు గని కార్మికుల త్యాగాలు ప్రారంభం అయ్యింది. అదే క్రమంలో 1920ల్లో 6 మిలియన్ మెట్రిక్ టన్నులు, 1930ల్లో 18 మిలియన్ మెట్రిక్ టన్నులు, 1946 ప్రాంతంలో 30 మిలియన్ మెట్రిక్ టన్నులు, 1950ల్లో 33 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగేది. 1970ల్లో భారత ప్రభుత్వం ప్రైవేటీకరణను చేపట్టడం, 2015లో డీనేషనలైజేషన్ చేపట్టడం జరిగింది. ఇండియాలో ఝార్ఖండ్, ఒడిసా, చత్తీస్‌ఘడ్, పశ్చిమ బెంగాల్, ఎంపీ, తెలంగాణ, మహారాష్ట్రల్లో బొగ్గు గనులు అధికంగా ఉన్నాయి.

బొగ్గు గని కార్మికపు ఎదుర్కొంటున్న సవాళ్ళు:

బొగ్గు గని కార్మికులు చేసే శ్రమ, అంకితభావం, భారత ఆర్థికాభివృద్ధిలో గని కార్మికులు పాత్రను శ్లాగించడం, శక్తి ఉత్పత్తికి ఊతం ఇవ్వడం జరుగుతోంది. బొగ్గు గని కార్మికులు ప్రమాదకర వాతావరణాల్లో పని చేయడం, వారి చెమటను శక్తిగా మార్చడం, ఇరుకైన ప్రదేశాల్లో పని చేయడంతో శ్వాసకోశ సమస్యలు రావడం, విష్పోటనాలు/లాండ్‌స్లైడ్స్/యంత్రాల లోపాలతో ప్రమాదాలు అధికంగా జరగడం, అధిక పని గంటలు కేటాయించడం, వైద్య ఆరోగ్య ఏర్పాట్లు తక్కువగా ఉండడం, భద్రతలో లోపాలు లాంటి సవాళ్ళతో గని కార్మికమగు మరణం అంచున పని చేస్తున్నారు.

గనుల్లో, బొగ్గుతో శరీరం నల్లబడడం, దేశ ప్రగతి రథ చక్రాలు పరుగులెత్తడానికి గని కార్మికులు చేస్తున్న త్యాగాలు అనన్య సామాన్యాలు. యాజమాన్యాలు తగు భద్రత చర్యలు తీసుకోవడం, వారి ఆరోగ్యానికి గొడుగులు పట్టడం కనీస అవసరం అని తెలుసుకోవాలి. అత్యంత ప్రమాదకర పరిశ్రమగా గుర్తించబడిన బొగ్గు గని పరిశ్రమ రానున్న రోజుల్లో కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం అవ్వాలి, గని కార్మికుల నల్లటి చేతులను ముద్దాడాలి.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

పేదలు.. రైతులు.. యువత.. నారీశక్తి మూల స్తంభాలుగా వికసిత భారత్ రూపుదిద్దుకుంటుంది

న్యూఢిల్లీ, మే 3:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు ఆంధ్రప్రదేశ్ లోని అమరావతిలో రూ.58,000 కోట్లకుపైగా విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేసి, మరికొన్నిటికి శంకుస్థాపన చేశారు. ఇవాళ పవిత్ర అమరావతి గడ్డపై నిల్చున్న తన మనో నేత్రంతో వీక్షిస్తున్నది ఒక నగరాన్ని మాత్రమే కాదని ఆయన వ్యాఖ్యానించారు. ఆ మేరకు ఒక స్వప్న సాకారాన్ని... ఓ కొత్త అమరావతిని.. నరికొత్త ఆంధ్రను దర్శిస్తున్నానని అభివర్ణించారు. "సంప్రదాయంతో ముడిపడిన పురోగమనానికి అమరావతిగడ్డ ఒక ప్రతీక. బౌద్ధ వారసత్వమైన శాంతి తోపాటు వికసిత భారత్‌ను రూపుదిద్దే శక్తిని కూడా ఈ నేల అక్కున చేర్చుకుంటుంది" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఈ రోజు పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయడాన్ని ప్రస్తావిస్తూ– ఇవి కేవలం కాంక్రీట్ నిర్మాణాలు కాదన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆకాంక్షలకు, భారత అభివృద్ధి దృక్పథానికి బలమైన పునాదులని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీరభద్ర స్వామి, అమరలింగేశ్వర స్వామి, తిరుపతి వేంకటేశ్వర స్వామిని స్మరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కల్యాణ్‌లకూ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇతిహాసాల ప్రకారం అమరావతి ఇంద్రలోక రాజధాని కాగా, ఇప్పుడది ఆంధ్రప్రదేశ్ రాజధాని అని శ్రీ మోదీ గుర్తుచేశారు. ఈ పరిణామం యాదృచ్ఛికం కాదని, ప్రగతి పథంలో భారత్ పయనాన్ని బలోపేతం చేసే 'స్వర్ణాంధ్ర' సృష్టికి సానుకూల సంకేతమని స్పష్టం చేశారు. 'స్వర్ణాంధ్ర' దృక్కోణానికి అమరావతి శక్తినిస్తుందని, పురోగమనంతోపాటు ప్రగతిశీల రూపాంతరీకరణకు దీన్నొక కూడలిగా మారుస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలుగులో మాట్లాడుతూ– "అమరావతి కేవలం ఓ నగరం కాదు.. అదొక శక్తి. ఆంధ్రప్రదేశ్‌ను ఆధునిక, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చే సామర్థ్యం దీనికుంది" అని వివరించారు.

ఆంధ్రప్రదేశ్ యువత కలలు సాకారం చేయగల నగరంగా అమరావతిని అభివర్ణిస్తూ– భవిష్యత్తులో ఇది సమాచార సాంకేతికత, కృత్రిమ మేధ, పరిశుభ్ర ఇంధనం, కాలుష్యరహిత పరిశ్రమలు, విద్య, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో ప్రముఖ నగరంగా రూపుదిద్దుకోగలదని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ రంగాలలో వృద్ధిని వేగిరపరచేందుకు తగిన మౌలిక సదుపాయాల సత్వర కల్పనలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర పూర్తి మద్దతిస్తోందని తెలిపారు.

భవిష్యత్ సాంకేతికతలను ముందుగానే పసిగట్టి, వాటిని వేగంగా అనుసరించడంలో శ్రీ చంద్రబాబు నాయుడు కుశాగ్రబుద్ధిని శ్రీ మోదీ ప్రశంసించారు. ఈ ప్రజా రాజధానికి శంకుస్థాపన చేసే అవకాశం 2015లో తనకు లభించిందని గుర్తు చేస్తూ– కొన్నేళ్లుగా ఈ నగరాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సమగ్ర మద్దతునిచ్చిందని చెప్పారు. ఈ మేరకు ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పన దిశగా అవసరమైన చర్యలన్నీ చేపట్టిందని పేర్కొన్నారు. శ్రీ నాయుడు నాయకత్వాన రాష్ట్రంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం అభివృద్ధి కృషిని వేగవంతం చేసిందని కొనియాడారు. నేటి నిర్మాణ కార్యకలాపాల్లో హైకోర్టు, శాసనసభ, సచివాలయం, రాజ్ భవన్ వంటి కీలక వ్యవస్థలకు ప్రాధాన్యమిస్తున్నదని ప్రముఖంగా ప్రస్తావించారు.

"వికసిత ఆంధ్రప్రదేశ్ ఎన్టీఆర్ గారి స్వప్నం" అని గుర్తుచేస్తూ– ఆ మేరకు సమష్టి కృషితో అమరావతిని, రాష్ట్రాన్ని వికసిత భారత్‌కు వృద్ధి చోదకంగా మారుద్దామని ప్రధాన మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని ఉద్దేశించి తెలుగులో మాట్లాడుతూ– ఇది మనందరి బాధ్యత... మనమంతా కలిసికట్టుగా నిర్వర్తించాల్సిన కర్తవ్యం" అన్నారు.

గడచిన దశాబ్దం నుంచీ భౌతిక, డిజిటల్, సామాజిక మౌలిక సదుపాయాల కల్పనపై భారత్ విస్తృతంగా దృష్టి సారించిందని శ్రీ మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. తదనుగుణంగా నేడు శరవేగంగా మౌలిక సదుపాయాల ఆధునికీకరణ సాగుతున్న ప్రపంచ దేశాల్లో ఒకటిగా ఉందని చెప్పారు. ఈ పురోగమనం ద్వారా ఆంధ్రప్రదేశ్ కూడా గణనీయ ప్రయోజనం పొందుతోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రూ.వేల కోట్ల విలువైన రహదారి, రైల్వే ప్రాజెక్టులు రాష్ట్రానికి కేటాయించిన నేపథ్యంలో ప్రగతి వేగం పుంజుకుంటున్నదని వివరించారు. "ఆంధ్రప్రదేశ్ ఇప్పుడో నవ్యానుసంధాన యుగంలో పయనిస్తోంది. తద్వారా జిల్లా నుంచి జిల్లాకు సంబంధాలు మెరుగుపడుతూ పొరుగు రాష్ట్రాలతో సంధానం కూడా మెరుగవుతుంది" అన్నారు. దీంతో రైతులకు మరింత పెద్ద మార్కెట్ల సౌలభ్యం కలుగుతుందని, రవాణా సామర్థ్యం పెరగడంతో పరిశ్రమలకూ ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. పర్యాటక, తీర్థయాత్ర రంగాలు కూడా ఊపందుకుంటాయని, కీలక ఆధ్యాత్మిక ప్రదేశాలు మరింత అందుబాటులోకి వస్తాయని శ్రీ మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా రేణిగుంట–నాయుడుపేట రహదారిని ఉదాహరిస్తూ– ఇది తిరుపతి వెంకన్న దర్శన సౌలభ్యాన్ని మరింత చేరువ చేస్తుందని చెప్పారు. ఆ మేరకు భక్తులు చాలా స్వల్ప సమయంలోనే శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోగలరని ఆయన పేర్కొన్నారు.

వేగంగా వృద్ధిచెందిన దేశాలు తమ రైల్వే నెట్‌వర్క్‌లకు అత్యధిక ప్రాముఖ్యం ఇస్తున్నాయని ప్రధాన మంత్రి గుర్తుచేశారు. మన దేశం లోనూ గత దశాబ్దం రైల్వేలకు ప్రగతిశీల రూపాంతరీకరణ కాలమని అభివర్ణించారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో నిధులు కేటాయించిందని వివరించారు. ఈ మేరకు 2009–2014 మధ్య ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడిగా రైల్వే బడ్జెట్‌లో రూ.900 కోట్లకన్నా తక్కువ కేటాయించగా, నేడు ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే రూ.9,000 కోట్లకుపైగా– అంటే... కేటాయింపులు పది రెట్లు పెరిగినట్లు ప్రధానమంత్రి స్పష్టం చేశారు. "రైల్వే బడ్జెట్ పెంపుతో ఆంధ్రప్రదేశ్‌లో రైల్వేల విద్యుదీకరణ 100 శాతం పూర్తయింది" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రం గుండా ఇప్పుడు 8 జతల ఆధునిక వందే భారత్ రైళ్లతోపాటు ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళ్లే అమృత్ భారత్ రైలు కూడా నడుస్తున్నాయని తెలిపారు. గడచిన పదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 750కిపైగా రైలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మితమైనట్లు చెప్పారు. అంతేకాకుండా రాష్ట్రంలోని 70కిపైగా రైల్వే స్టేషన్లను 'అమృత్ భారత్ స్టేషన్' పథకం కింద ఆధునికీకరిస్తున్నామని, ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ప్రధాని వెల్లడించారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధి బహుగుణ ప్రభావాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ– తయారీ రంగంపై దాని ప్రత్యక్ష ప్రభావాన్ని వివరించారు. సిమెంటు, ఉక్కు వంటి ముడిపదార్థాల రవాణాతోపాటు రవాణా సేవల వంటి రంగాలు భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ద్వారా గణనీయ ప్రయోజనం పొందుతాయన్నారు. అలాగే బహుళ రంగ పరిశ్రమలు బలోపేతం కాగలవని శ్రీ మోదీ పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పన దేశ యువతకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుస్తుందని, మరిన్ని ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని చెప్పారు. ఈ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కొనసాగింపు ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోనూ వేలాదిగా యువతకు కొత్త ఉద్యోగావకాశాలు అందివస్తున్నాయని ఆయన గుర్తుచేశారు.

"పేదలు, రైతులు, యువత, మహిళా సాధికారత అనే నాలుగు మూల స్తంభాల పునాదిపైనే వికసిత భారత్ ఆధారపడి ఉంది" అంటూ లోగడ ఎర్రకోట పైనుంచి తన ప్రసంగంలో ప్రస్తావించడాన్ని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. ఈ నాలుగు స్తంభాలూ తమ ప్రభుత్వ విధానాలకు కేంద్రకంగా ఉన్నాయని, రైతు సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్య మిస్తున్నామని ఆయన వివరించారు. రైతులపై ఆర్థిక భారం తగ్గింపులో భాగంగా గత పదేళ్లలో వారికి సరసమైన ధరతో ఎరువులు సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.12 లక్షల కోట్లు ఖర్చు చేసిందని ఆయన గుర్తుచేశారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు లక్ష్యంగా వేలాది కొత్త, ఆధునిక విత్తన రకాలను వంపిణీ చేశామని చెప్పారు. ప్రధానమంత్రి పంటల బీమా పథకం కింద రాష్ట్రంలో రూ.5,500 కోట్ల విలువైన రైతుల అభ్యర్థనలను పరిష్కరించినట్లు వెల్లడించారు. దీంతోపాటు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద రాష్ట్రంలోని లక్షలాది రైతుల ఖాతాలకు రూ.17,500 కోట్లకుపైగా నేరుగా బదిలీ చేశామని తెలిపారు. తద్వారా వారి జీవనోపాధికి కూడా ఆర్థిక సహాయం అందుతుందని ఆయన అన్నారు.

దేశవ్యాప్తంగా నీటిపారుదల ప్రాజెక్కుల విస్తరణ వేగంగా సాగుతున్నదని, నదుల అనుసంధాన కార్యక్రమాల ప్రారంభంతోపాటు ప్రతి కమతానికీ నీరందుతూ రైతులకు నీటి కొరత లేకుండా చేశామని శ్రీ మోదీ వివరించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో పోలవరం ప్రాజెక్టు పనులు ఊపందుకున్నాయని, దీనిద్వారా తమ జీవితాల్లో ప్రగతిశీల మార్పు రాగలదని లక్షలాదిగా ప్రజలు ఆశాభావంతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తిచేయడంలో తమ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి మద్దతిస్తుందన్న హామీని పునరుద్ఘాటించారు.

దేశాన్ని అంతరిక్ష శక్తిగా రూపొందించడంలో దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించిందని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. శ్రీహరికోట నుంచి ప్రారంభమైన ప్రతి ప్రయోగం లక్షలాది భారతీయుల హృదయాలు ఉప్పొంగేలా చేస్తున్నదని పేర్కొన్నారు. అలాగే అంతరిక్ష పరిశోధనల వైపు దేశ యువతరాన్ని ప్రేరేపిస్తుందని చెప్పారు. భారత రక్షణ రంగంలో ఒక భారీ పరిణామాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ మేరకు కొత్త రక్షణ వ్యవస్థ శ్రీకారం చుట్టుకున్నదని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 'డిఆర్‌డిఒ' కొత్త క్షిపణి పరీక్షా కేంద్రానికి పునాది పడిందని గుర్తుచేస్తూ– ఈ దిశగా నాగాయలంకలోని 'సవదుర్గ పరీక్షా కేంద్రం' దేవ రక్షణ సామర్థ్యాన్ని బహుగుణంగా పెంచుతుందన్నారు. దుర్గామాత దివ్య శక్తి నుంచి ఇది సంపూర్ణ బలం సంతరించుకోగలదని ప్రధానమంత్రి ఆకాంక్షించారు. ఈ కీలక ఘట్టం సాకారం కావడంపై శాస్త్రవేత్తలతోపాటు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు.

"భారత్ బలం ఆయుధ శక్తిలో కాకుండా దాని ఐక్యతలో ఉంది" అని ప్రధానమంత్రి అభివర్ణించారు. దేశవ్యాప్తంగా నగరాల్లో ఏర్పాటవు 'ఏక్తా మాల్స్' ద్వారా ఈ ఐక్యతా స్ఫూర్తి మరింత బలోపేతం అవుతున్నదని పేర్కొన్నారు. విశాఖపట్నం త్వరలోనే తనదైన భూగర్భ మాల్‌ను సొంతం చేసుకుంటుందని, దేశవ్యాప్తంగాగల చేతివృత్తులవారు, హస్త కళాకారులు తమ ఉత్పత్తులను ఇక ఒకే వేదికపై ప్రదర్శిస్తారని ఆయన ప్రకటించారు. ఈ మాల్స్ సుసంపన్న భారతీయ వైవిధ్యంతో ప్రజలను అనుసంధానిస్తూ స్థానిక ఆర్థిక వ్యవస్థ వృద్ధికి దోహదం చేస్తాయన్నారు. తద్వారా "ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్" దార్శనికతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.

ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21) నేపథ్యంలో పదో వార్షిక వేడకలను ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తామని, దీనికి తాను కూడా హాజరవుతానని ప్రధానమంత్రి ప్రకటించారు. రాబోయే 50 రోజుల్లో యోగాపై మరిన్ని కార్యకలాపాలు చేపట్టి ప్రపంచ రికార్డు సృష్టించాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కలలు కనేవారికి లేదా వాటిని సాకారం చేసుకోగల యువతకు కొరత లేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రం నేడు సరైన మార్గంలో ముందడుగు వేస్తూ, సముచిత వృద్ధి వేగాన్ని సంతరించుకున్నదనే విశ్వాసం తనకుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రగతిని వేగిరపరచడంలో సుస్థిర వేగం ప్రాధాన్యాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ దిశగా అంకితభావంతో మద్దతుకు హామీ ఇస్తూ, ఈ కృషిలో ప్రజలతో భుజం కలిపి నడుస్తానంటూ ప్రధాని తన ప్రసంగం ముగించారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ సయ్యద్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్.చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాల కల్పన, అనుసంధానానికి భరోసాపై తన నిబద్ధత మేరకు ఆంధ్రప్రదేశ్‌లో 7 జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రధానమంత్రి ఇవాళ ప్రారంభించారు. వీటిలో వివిధ జాతీయ రహదారుల విభాగాల విస్తరణ, రోడ్ ఓవర్ బ్రిడ్జి, సబ్‌వే నిర్మాణం వంటి పనులున్నాయి. ఇవన్నీ రహదారి భద్రతకు తోడ్పడటంతోపాటు ఉపాధి అవకాశాలను కూడా సృష్టిస్తాయి. అలాగే తిరుపతి, శ్రీకాళహస్తి, మాలకొండ, ఉదయగిరి కోట వంటి ఆధ్యాత్మిక, చారిత్రక పర్యాటక ప్రదేశాలకు నిరంతర సంధానం కల్పిస్తాయి.

అనుసంధానం, సామర్థ్యం పెంపు లక్ష్యంగా రూపొందిన రైల్వే ప్రాజెక్టులను ప్రధానమంత్రి ఈ సందర్భంగా దేశానికి అంకితం చేశారు. వీటిలో బుగ్గనపల్లె సిమెంట్ నగర్–పాణ్యం స్టేషన్ల మధ్య రైలు మార్గం డబ్లింగ్, రాయలసీమ–అమరావతి మధ్య అనుసంధానం పెంపు, న్యూ వెస్ట్ బ్లాక్ హట్ క్యాబిన్–విజయవాడ స్టేషన్ల మధ్య మూడో రైలు మార్గం నిర్మాణం వంటివి ఉన్నాయి.

ఇక 6 జాతీయ రహదారి ప్రాజెక్టులు, ఒక రైల్వే ప్రాజెక్టుకు ప్రధాని శంకుస్థాపన చేశారు. వీటిలో జాతీయ రహదారులలోని వివిధ విభాగాల విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, హాఫ్ క్లోవర్ లీఫ్, రోడ్ ఓవర్ బ్రిడ్జి వంటి పనులు అంతర్భాగంగా ఉన్నాయి. వీటితో అనుసంధానం మెరుగుపడి, అంతర్రాష్ట్ర ప్రయాణ సమయంతోపాటు రద్దీ తగ్గుతుంది. మొత్తంమీద రవాణా సామర్థ్యం ఇనుమడిస్తుంది. సరకు రవాణా రైళ్ల దారిమళ్లింపు, గుంతకల్లు జంక్షన్ వద్ద రద్దీ తగ్గింపు లక్ష్యంగా గుంతకల్లు వెస్ట్–మల్లప్ప గేట్ స్టేషన్ల మధ్య రైల్ ఓవర్ రైల్ నిర్మాణం కూడా వీటిలో ఉంది.

అమరావతిలో రూ.11,240 కోట్లకుపైగా విలువైన శాసనసభ, హైకోర్టు, సచివాలయం, ఇతర పరిపాలన భవనాలు సహా 5,200 కుటుంబాలకు గృహ వసతి కల్పించే బహుళ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.17,400 కోట్లకుపైగా విలువైన భూగర్భ సదుపాయాలు, అత్యాధునిక వరద నిర్వహణ వ్యవస్థలతో కూడిన 320 కిలోమీటర్ల అంతర్జాతీయ స్థాయి రవాణా నెట్‌వర్క్‌గల ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వరద ఉపశమన ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. అలాగే ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రాజధాని అమరావతి అంతటా సెంట్రల్ మీడియన్లు, సైకిల్ ట్రాక్‌లు, సమీకృత సదుపాయాల 1,281 కిలోమీటర్ల పొడవైన రోడ్లు వంటి పనులను రూ.20,400 కోట్లకుపైగా నిధులతో చేపడతారు.

ఆంధ్రప్రదేశ్‌లోని నాగాయలంక వద్ద దాదాపు రూ.1,460 కోట్లతో క్షిపణి పరీక్ష కేంద్రం నిర్మాణానికి కూడా ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. ఇందులో ఒక ప్రయోగ కేంద్రం, సాంకేతిక పరికరాల సదుపాయాలు, దేశ రక్షణ సంసిద్ధతను ఇనుమడింపజేసే స్వదేశీ రాడార్లు, టెలిమెట్రీ సహా ఎలక్ట్రో–ఆప్టికల్ వ్యవస్థలు ఉంటాయి.

విశాఖపట్నంలోని మధురవాడలో 'పిఎం ఏక్తా మాల్'కు ప్రధాని శంకుస్థాపన చేశారు. జాతీయ సమైక్యతను పెంపు, 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి మద్దతు, 'ఒక జిల్లా– ఒక ఉత్పత్తి' పథకానికి ప్రోత్సాహం, ఉపాధి అవకాశాల సృష్టి, గ్రామీణ కళాకారులకు సాధికారత స్వదేశీ ఉత్పత్తులకు మార్కెట్ సౌలభ్యం పెంపు లక్ష్యాలుగా దీనికి రూపకల్పన చేశారు.

42 సార్లు ఢిల్లీలో రేవంత్ చక్కెర్లు ..

–ఉపాధి హామీ పని దినాలు తగ్గింపు : హరీశ్ రావు

హైదరాబాద్, మే 3:ఢిల్లీకి 42 సార్లు వెళ్లినా సాధించింది గుండు సున్నా అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు.. ఈ మేరకు ఆయన ఎక్స్ ఖాతాలో ట్విట్ చేశారు.. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లడం వల్ల లాభం కంటే నష్టం ఎక్కువ జరిగిందంటూ పేర్కొన్నారు.. కేంద్రం ఉపాధి పనిదినాల్లో రాష్ట్ర కోటాను సగానికిపైగా తగ్గించిందని, ముఖ్యమంత్రి 42సార్లు ఢిల్లీకి వెళ్లి చేసిందేంటి అని ప్రశ్నించారు.'2024–25లో తెలంగాణకు ఉపాధి హామీ పనిదినాలను 12.22 కోట్ల నుంచి 6.5 కోట్లకు కేంద్ర ప్రభుత్వం సగానికి తగ్గించింది. ముఖ్యమంత్రి ఢిల్లీకి 42సార్లు వెళ్లినా ఉపాధి హామీ పనిదినాలు సగానికి తగ్గాయి. విషయం తెలిసినా రాష్ట్రంలోని 8 మంది కాంగ్రెస్ ఎంపీలతో పాటు 8 మంది బీజేపీ ఎంపీలు మౌనంగా ఉన్నారు. ఉపాధి హామీ కూలీల వేతనాలు 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం, కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి వైఖరిని ప్రదర్శిస్తున్న తీరు స్పష్టంగా కనిపిస్తోంది. వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనిదినాలను పెంచాలని, బకాయిలను చెల్లించాలని మేము డిమాండ్ చేస్తున్నాం" అని హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

చెల్పూర్ కు మహర్దశ.. రూ.5కోట్లతో మోడ్రన్ బస్టాండ్ : ఎమ్మెల్యే గండ్ర

వరంగల్, మే 3:జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ మేజర్ గ్రామపంచాయతీలో నూతన బస్టాండ్ కు త్వరలో మోక్షం లభించనుందని, రూ.5కోట్లతో మోడ్రన్ బస్టాండ్ ఏర్పాటు కానుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా బస్టాండ్ లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న చెల్పూర్ ప్రజల సమస్య దృష్టిలో ఉంచుకుని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక దృష్టి సారించారు. దీనితో జెన్కో సౌజన్యంతో నూతన బస్టాండ్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు శనివారం కేటీపీపీ సీఈ ప్రకాష్ తో స్థల పరిశీలన చేశారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. రెండు ఎకరాల్లో మోడ్రన్ బస్ స్టాప్ నిర్మించేందుకు సీఎండీ ఆఫీసుకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు రిప్రెజెంటేషన్ ఇవ్వడం జరిగిందన్నారు.

బస్టాండ్ కు రెండు ఎకరాలు కేటాయించాల్సిందిగా కోరడం జరిగిందని గత మూడు నెలల క్రితమే జెన్కొ నుండి రూ.5కోట్ల సిఎస్సార్ నిధులు కేటాయించడం జరిగిందన్నారు. టెండర్లు పూర్తిచేసి 60 గుంటల్లో బస్టాండ్ నిర్మాణానికి శిలాఫలకం వేసి త్వరలోనే ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దుల శ్రీధర్ బాబుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు వారు తెలిపారు.

బస్టాండ్ నిర్మాణానికి డబ్బులు తక్కువ పడితే తన నిధుల నుండి కేటాయించి మోడ్రన్ బస్టాండ్ నిర్మించడం జరుగుతుందన్నారు. జెన్కో యాజమాన్యానికి ప్రభుత్వానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కొమురయ్య, నాయకులు కొత్త వెంకన్న, లక్కం రాములు, కావటి రవి, సూరినేని సంపత్ రావు, పిన్నింటి మాధవరావు, కాల్వ రాంరెడ్డి, తోట సంతోష్, జకినపెల్లి బిక్షపతి, నాగరాజు, బీరెల్లి నరేష్ కంచర్ల కుమార్, కార్యదర్శి ముక్కెర హేమంత్ గౌడ్, కారోబార్ వేణు, జెన్కో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాకిస్తాన్‌లో తయారయ్యే లేదా అక్కడి ను

వేవ్స్ 2025 బ్రేక్ అవుట్ సెషన్: భారత్‌లో అభివృద్ధి చెందుతున్న సృజనాత్మక కేంద్రంగా మధ్యప్రదేశ్

న్యూఢిల్లీ, మే 3:"డిజిటల్ డ్రీమ్స్ అండ్ సినిమాటిక్ విజన్స్ – తదుపరి సృజనాత్మక కేంద్రంగా మధ్యప్రదేశ్" పేరుతో ఒక ఉన్నత స్థాయి బ్రేకౌట్ సెషన్ ను ఈరోజు వేవ్స్ 2025లో నిర్వహించారు. ఈ సెషన్‌ను వెరైటీ ఇంటర్నేషనల్ కరస్పాండెంట్ నామన్ రామచంద్రన్ మోడరేట్ చేశారు.

ప్రముఖ నిర్మాత, దర్శకురాలు ఏక్తా కపూర్ మధ్యప్రదేశ్ ప్రభుత్వ ఫిల్మ్ టూరిజం పాలసీ 2025ని అధికారికంగా ప్రారంభించారు. ఇదే సెషన్లో ఎవిజిసి ఎక్స్ఆర్ పాలసీ 2025తో పాటు మధ్యప్రదేశ్ ఫిల్మ్ సెల్ పోర్టల్ రెండో దశను కూడా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏక్తా కపూర్ మాట్లాడుతూ, సినిమా చిత్రీకరణ ప్రాంతాన్ని ఎంపిక చేసే సమయంలో రాయితీలు, అనుమతులు పొందడంలో సౌలభ్యం, దృశ్య పరమైన అందాలు, షూటింగ్‌కు అనుకూలమైన పరిస్థితులు వంటి అంశాలు అత్యంత ముఖ్యమని చెప్పారు.

మధ్యప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ షియోశేఖర్ శుక్లా మాట్లాడుతూ... మధ్యప్రదేశ్ 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా'కు గుండెగా నిలిచిందని, అదే విధంగా ఇది వేగంగా చిత్ర నిర్మాతల గుండెగా కూడా మారుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో షూటింగ్‌కు అనుకూలమైన వాతావరణం, ఘనమైన చరిత్ర, వారసత్వం, అలాగే ప్రతిభావంతులు ఉన్నారని ఆయన తెలిపారు. ఉత్తమ ప్రమాణాలతో కూడిన ఆర్థిక ప్రోత్సాహక విధానాన్ని రాష్ట్రం కలిగి ఉంది. అనుమతుల కోసం ఏర్పాటయిన సరళీకృత సింగిల్ పోర్టల్ వ్యవస్థ షూటింగ్ సౌలభ్యాన్ని అందిస్తుంది. 2.0 పాలసీ లో పెంచిన ప్రోత్సాహకాలు, పునరావృత షూటింగ్ కోసం ప్రత్యేక నిబంధనలు ఉన్నాయని ఆయన తెలిపారు. స్థానిక భాషలు, స్థానిక ప్రతిభను ఉపయోగించే చిత్రాలకు, అలాగే మధ్యప్రదేశ్‌లో షూటింగ్ చేసే ఇతర భారతీయ భాషల చిత్రాలకు అదనపు ప్రోత్సాహకాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. చిత్రనిర్మాణాన్ని ప్రోత్సహించే మార్గంలో రాష్ట్రాన్ని బ్రాండ్ చేయడం ద్వారా ముంబయికి గట్టి పోటీనివ్వాలని మధ్యప్రదేశ్ లక్ష్యంగా పెట్టుకున్నదని ఆయన తెలిపారు.

మధ్యప్రదేశ్ ప్రభుత్వ ఐటీ, డీఎస్టీ విభాగం అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ దూబే మాట్లాడుతూ, కొత్త ఏవీజీసీ విధానం ప్రీ, పోస్ట్ ప్రొడక్షన్లకు తోడ్పడుతుందని, యానిమేషన్, గేమింగ్, వీఎఫ్ ఎక్స్ వంటి సంబంధిత రంగాలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. చిత్రనిర్మాతలకు మద్దతు ఇచ్చే విషయంలో ప్రభుత్వ చురుకైన, రిస్క్ తీసుకునే విధానాన్ని ఆయన ప్రముఖంగా వివరించారు.

క్రియేటివ్ ల్యాండ్ స్టూడియోస్ సీఈఓ, ప్రముఖ నిర్మాత శోభా సంత్ మాట్లాడుతూ... స్థానిక ప్రతిభ, సాంకేతిక నిపుణులతో మధ్యప్రదేశ్‌లో చిత్రీకరించిన స్త్రీ 2 చిత్రం అనుభవాలను పంచుకున్నారు. అలాగే, లయన్, ఎ సూటబుల్ బాయ్ వంటి అంతర్జాతీయ చిత్రాలను కూడా రాష్ట్రంలోనే చిత్రీకరించారని ఆమె ఉదాహరించారు. రానున్న ఆస్ట్రేలియన్ సంయుక్త నిర్మాణ చిత్రం కూడా మధ్యప్రదేశ్‌ను తన చిత్రీకరణ ప్రదేశంగా ఎంచుకుంది. మధ్యప్రదేశ్‌లో షూటింగ్ చేసిన బృందాల నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, "ఒకసారి మధ్యప్రదేశ్‌కి వచ్చిన వారు, మళ్లీ మళ్లీ రావాలనుకుంటారు" అని శోభా సంత్ పేర్కొన్నారు.

ప్యానెల్‌లో ఉన్న ఇతర ప్రముఖులలో ఆగస్ట్ మీడియా గ్రూప్ సీఈఓ జ్యోతిర్మయ్ సాహా మాట్లాడుతూ ? కొత్త విధానాలు రాష్ట్రవ్యాప్తంగా సృజనాత్మక కేంద్రాల ఏర్పాటుకు ప్రేరకశక్తిగా పనిచేస్తాయని తెలిపారు. ఫిక్కీ ఏవీజీసీ విభాగం చైర్మన్ ఆశిష్ కులకర్ణి మాట్లాడుతూ, మధ్యప్రదేశ్ ఆకర్షణలలో భాగంగా అక్కడి వంటకాలు, గిరిజన మ్యూజియం గ్లోబల్ స్కిల్స్ పార్క్ వంటి ప్రత్యేకతల గురించి ప్రస్తావించారు.

ప్రభావశీల పైరసీ నిరోధక చర్యల అమలుతో చట్టబద్ధ వీడియో సేవల వినియోగదారుల సంఖ్య 25 శాతం పెరుగుతుందని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, మే 3:వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్–2025 (వేవ్స్)లో "పైరసీ: సేఫ్‌గార్డింగ్ కంటెంటె త్రూ టెక్నాలజీ" ఇతివృత్తంగా బృంద గోష్ఠి నిర్వహించారు. డిజిటల్ కంటెంట్ ఆర్థిక వ్యవస్థను పీడిస్తున్న అత్యంత కీలక సమస్యలలో పైరసీ ఒకటి. ఈ బెడద నిరోధంపై చర్చించేందుకు మీడియా, చట్టం, సైబర్ భద్రత రంగాల ప్రపంచ అగ్రశ్రేణి నిపుణుల బృందాన్ని ఈ వేదిక ఏక తాటిపైకి తెచ్చింది. 'ఐపి హౌస్'లో వైస్ ప్రెసిడెంట్–ఆసియా పసిఫిక్ అధిపతి నీల్ గేన్ ఈ గోష్ఠికి సంధానకర్తగా వ్యవహరించారు. పైరసీ ఇక ఎంతమాత్రం ఉపేక్షించదగిన స్వల్ప సమస్య కాదని ఈ సందర్భంగా నిపుణులు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఆ మేరకు దీన్ని సమన్వయ సహిత బహుకోణీయ ప్రతిస్పందన అవశ్యమైన ప్రధాన స్రవంతి ముప్పుగా పరిగణించాలని వారు ముక్తకంఠంతో స్పష్టం చేశారు.

విచ్చలవిడి పైరసీ ఫలితంగా పరిశ్రమకు ఆర్థికంగా వాటిల్లే నష్టం పరిమాణాన్ని 'మీడియా పార్టనర్స్ ఆసియా' మేనేజింగ్ అండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వివేక్ కౌటో ఈ సందర్భంగా అంచనా వేశారు. ఈ మేరకు "ఆన్‌లైన్ పైరసీ వల్ల 2025–2029 మధ్య పరిశ్రమకు 10 శాతానికిపైగా ఆదాయ నష్టం తప్పదని భావిస్తున్నాం" అని స్పష్టం చేశారు. "అయితే, ప్రభావశీల పైరసీ నిరోధక చర్యల అమలుతో చట్టబద్ధ వీడియో సేవల వినియోగదారుల సంఖ్య 25 శాతందాకా పెరుగుతుంది. దీంతోపాటు కంటెంట్పై పెట్టుబడి 0.5 బిలియన్ డాలర్ల మేర పెరగడానికి దోహదం చేస్తుంది. తద్వారా 2029 నాటికి పరిశ్రమ మొత్తం విలువ 3.8 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుతుంది" అని ఆయన విశదీకరించారు. ముఖ్యంగా భారత డిజిటల్ వీడియో ఆర్థిక వ్యవస్థ పరిమాణం దృష్ట్యా పైరసీపై చర్యను రక్షణకు పరిమితం చేయకుండా అరికట్టే సామర్థ్యం వైపు మళ్లించాల్సి ఉందని పరిశ్రమ భాగస్వాములకు ఆయన సూచించారు.

డిజిటల్ పైరసీ, సైబర్ నేరాల మధ్యగల సంబంధం గురించి 'ఐఎస్‌బి ఇనిస్టిట్యూట్ ఆఫ్ డేటా సైన్స్' అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ శ్రుతి మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ''పైరసీలో తరచూ ట్రోజన్లు, రాన్సమ్‌వేర్, స్పైవేర్ వంటి హానికర ఉపకరణాలు అంతర్భాగంగా ఉంటాయి. వీటికి 18?24 ఏళ్ల మధ్య వయస్కులైన యువ వినియోగదారులు ఎక్కువగా బలయ్యే ముప్పు ఉంటుంది" అని ఆమె వివరించారు. అందువల్ల సమగ్ర ప్రజాచైతన్య, అవగాహన కార్యక్రమాల నిర్వహణ అవసరమని పిలుపునిచ్చారు. ఆ మేరకు పైరసీ ఆటకట్టించే చర్యలు అవగాహన సహిత వినియోగదారులతో మొదలు కావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో 'ఐఎస్‌బి' జూలై 9?10 తేదీలలో సీబీఐ, ఇంటర్‌పోల్ సహకారంతో 'డిజిటల్ పైరసీ సమ్మిట్' నిర్వహించనున్నదని ఆమె ప్రకటించారు.

క్రీడా రంగంలో పైరసీ నిరోధక కార్యకలాపాలు, విధానాల గురించి 'డిఎజడ్ఎన్' పైరసీ నిరోధక కార్యకలాపాల అధిపతి అనురాగ్ కశ్యప్ తన ప్రసంగంలో వివరించారు. ''మూడు 'డి'లకు ప్రాధాన్యంతో మా త్రిముఖ వ్యూహం రూపుదిద్దుకుంది. ఇందులో 'డిటెక్షన్, డిజ్రప్షన్, డిటరెన్స్' (పసిగట్టడం, విచ్ఛిన్నం, నిరోధం) అంతర్భాగం ఉంటాయి. ఏదైనా ఈవెంట్ ప్రత్యక్ష ప్రసారం కావడానికి ముందుగానే ఈ వ్యూహాన్ని మేం అమలు చేస్తాం" అని ఆయన విశదీకరించారు. లీక్‌లను పసిగట్టే ప్రక్రియలో అదృశ్య వాటర్‌మార్కింగ్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

జియో హాట్‌స్టార్‌లో న్యాయ వ్యవహారాల విభాగాధిపతి అనిల్ లాలే మాట్లాడుతూ– చట్టాల పటిష్ఠ అమలు ప్రాధాన్యాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. ''పైరసీకి పాల్పడేవారిపై న్యాయ విచారణ అతిపెద్ద అవరోధం. లీక్‌ల మూలాన్ని గుర్తించి, వాటి సమాంతర ప్రసారాన్నిఅడ్డుకునేలా చట్ట వ్యవస్థ చర్యలుండాలి" అని ఆయన అన్నారు. ఆ మేరకు నిరోధమన్నది ప్రతిస్పందనలా కాకుండా ముందస్తు చర్యగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

'ఆనంద్ అండ్ ఆనంద్ అసోసియేట్స్' ప్రతినిధి ప్రవీణ్ ఆనంద్ ప్రసంగిస్తూ– సాంకేతిక పరిజ్ఞానంతోపాటు న్యాయ సంస్కరణల ద్వారానే పరిష్కారం సాధ్యమని స్పష్టం చేశారు. "సాంకేతికత రీత్యా ఏఐ, బ్లాక్‌చెయిన్, వాటర్‌మార్కింగ్ వంటి ఉపకరణాలు చాలా ముఖ్యం. అంతేగాక మెటల్ డిటెక్టర్ల వంటి చర్యల ద్వారా మనం 'క్యాప్‌కార్డింగ్'ను అడ్డుకోవాలి. అలాగే నిరోధ భయం సృష్టించడంలో చట్టబద్ధ సత్వర చర్యలు అత్యంత కీలకం" అని ఆయన వివరించారు.

డిజిటల్ కంటెంట్ భవిష్యత్తును రక్షించాలంటే సాంకేతికత, చట్టం, అమలు సంస్థలతోపాటు ప్రజాచైతన్యం సమష్టిగా కృషిచేసే 'ఏకీకృత శక్తి' అవసరాన్ని నిపుణుల బృందం స్పష్టం చేసింది. మీడియా–వినోద పరిశ్రమకుగల అత్యంత సంక్లిష్ట నవాళ్ల పరిష్కారంలో కార్యాచరణాత్మక వ్యూహాలు ప్రధానంగా వేవ్స్–2025 ఇటువంటి చర్చాగోష్ఠులకు ప్రాముఖ్యమిస్తుంది.

ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ 2025 కోసం నామినేషన్లు

న్యూఢిల్లీ, మే 3:దేశవ్యాప్తంగా బాలలు సాధించిన అసాధారణ విజయాలకు గుర్తింపుగా ఏటా భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అందించే ప్రతిష్ఠాత్మక అవార్డు అయిన 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ (పీఎంఆర్బీపీ)–2025 కోసం భారత ప్రభుత్వం నామినేషన్లను ఆహ్వానించింది. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ జూలై 31. అన్ని నామినేషన్లను అధికారిక రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ https://awards.gov.in. ని ద్వారా ఆన్‌లైన్‌లోనే సమర్పించాలి.

5 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సున్న పిల్లలు (జూలై 31 నాటికి) నామినేషన్లకు అర్హులు. అసాధారణ విజయాలను సాధించిన పిల్లలను ఎవరైనా వ్యక్తి లేదా సంస్థ పీఎంఆర్బీపీ కోసం నామినేట్ చేయవచ్చు. పిల్లలు స్వీయ నామినేషన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు చేసుకోవడం కోసం– ముందుగా మొదటి పేరు, చివరి పేరు, పుట్టిన తేదీ, దరఖాస్తుదారు విభాగం (వ్యక్తి/సంస్థ), మొబైల్ నంబర్, ఇ–మెయిల్ ఐడీ, ఆధార్ నంబర్ మొదలైన వివరాలను అందించడం ద్వారా పోర్టల్‌లో నమోదు చేసుకుని లేదా లాగిన్ అయ్యి, క్యాప్చా ధ్రువీకరణ పూర్తిచేయాలి. రిజిస్టర్ చేసుకున్న తర్వాత ప్రస్తుత నామినేషన్ల విభాగం కింద 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్– 2025'ని ఎంచుకుని, 'నామినేట్/అప్లై నౌ'పై క్లిక్ చేయాలి. దరఖాస్తుదారులు సంబంధిత అవార్డు విభాగాన్ని ఎంచుకుని, నామినేషన్ తమ కోసమా లేక మరెవరి కోసమా అన్నది తెలియజేయాలి.

దరఖాస్తు ఫారం కోసం నామినీ వివరాలు, సాధించిన విజయమూ దాని ప్రభావాన్ని వివరించే సంక్షిప్త కథనమూ (గరిష్టంగా 500 పదాలు), సహాయక పత్రాల అప్‌లోడ్ (పీడీఎఫ్ ఫార్మాట్, గరిష్టంగా 10 అటాచ్‌మెంట్లు), ఇటీవలి ఫొటో (జేపీజీ/జేపీఈజీ/పీఎన్జీ ఫార్మాట్) అవసరం. తుది సమర్పణకు ముందు దరఖాస్తులను డ్రాఫ్టులుగా సేవ్ చేసుకుని అవసరమైతే ఎడిట్ చేసుకోవచ్చు. క్షుణ్ణంగా సమీక్షించి సమర్పించిన అనంతరం డౌన్‌లోడ్ చేసుకోగల దరఖాస్తు ప్రతి రిఫరెన్సు కోసం అందుబాటులో ఉంటుంది.

కింది ఆరు విభాగాల్లో ప్రతిభ ప్రదర్శించిన 18 ఏళ్ల కన్నా తక్కువ వయస్సున్న (2025 జూలై 31 నాటికి) పిల్లలను ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ ద్వారా సత్కరిస్తారు: ధైర్య సాహసాలు, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ.

విభిన్న రంగాలలో దేశ యువత సాధించిన విజయాలను ఘనంగా చాటడం, నిజ జీవితంలో ఆదర్శప్రాయులను పరిచయం చేయడం ద్వారా దేశవ్యాప్తంగా చిన్నారుల్లో స్ఫూర్తిని నింపడం, పిల్లల సమగ్రాభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని పెంపొందించడం ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల లక్ష్యాలు.

మరింత సమాచారం కోసం, నామినేట్ చేయడానికి సందర్శించండి– – https://awards.gov.in.

గ్రూప్ 1 మెయిన్స్ ఎగ్జామ్స్ ప్రారంభం.. తొలిసారి ట్యాబ్ ద్వారా ప్రశ్నాపత్రాలు పంపిణీ

విజయవాడ,మే 3:ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం అయ్యాయి. ఈ మెయిన్స్ పరీక్షలు మే 3 నుండి మే 9 వరకు కొనసాగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా ఈ పరీక్షల కోసం ప్రశ్నాపత్రాలను ట్యాబ్ ద్వారా అభ్యర్థులకు అందించడం విశేషం..

ఇక రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురం వంటి నాలుగు ప్రధాన నగరాల్లో మొత్తం 13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు స్పష్టం చేశారు. ఈ పరీక్షలకు మొత్తం 4,496 మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. వీరిలో విశాఖలో 1,190 మంది, విజయవాడలో 1,801 మంది, తిరుపతిలో 911 మంది, అనంతపురంలో 594 మంది అభ్యర్థులు ఉన్నారు.

పరీక్షా రోజున అభ్యర్థులు ఉదయం 8:30 నుంచి 9:30 గంటల మధ్యలో తమ పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో గరిష్ఠంగా 9:45 వరకు మాత్రమే ప్రవేశం అనుమతించబడుతుంది. ఆ తర్వాత వచ్చేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి అనుమతించరని ఏపీపీఎస్సీ స్పష్టం చేసింది. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుంది. పరీక్ష సమయం ముగిసే వరకు అభ్యర్థులకు హాలులోనే ఉండాల్సి ఉంటుంది.

రంగనాయక సాగర్ రిజర్వాయర్ లో మునిగి ఇద్దరు చిన్నారులు మృతి

సిద్దిపేట, మే 3:చిన్నకోడూరు మండలం రంగనాయక సాగర్ రిజర్వాయర్ వద్ద విషాదం నెలకొంది. రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు ఇద్దరు పిల్లలు గల్లంతయ్యారు. వీరిలో ఒకరు మృతి చెందగా, మరొకరి కోసం గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టారు. వేనవి సెలవుల నేపథ్యంలో ఓ రెండు కుటుంబాలు ఇవాళ రంగనాయక సాగర్ రిజర్వాయర్ చూసేందుకు వెళ్లారు. అక్కడ ఆ కుటుంబాలకు చెందిన పిల్లలు సరదాగా ఆడుకుంటూ నీళ్లల్లో దిగారు. దీంతో బాలుడు, బాలిక నీటిలో గల్లంతయ్యారు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు.

ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. రిజర్వాయర్ వద్దకు చేరుకుని గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

బాలిక మృతదేహాన్ని బయటకు తీశారు. బాలుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. రిజర్వాయర్‌లో పడిన బాలుడు మిరాజ్(15), బాలిక అర్బాన్(15)గా పోలీసులు గుర్తించారు.

కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

వచ్చే నెల 21వ తేదీన విశాఖకు రానున్న ప్రధాని

అమరావతి, మే 3:విశాఖపట్నం : ఏపీలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చే నెల 21వ తేదీన విశాఖలో నిర్వహించనున్న కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకానున్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి విశాఖ జిల్లా అధికారులకు సమాచారం అందిం ది. విశాఖలో ఏటా తూర్పు నౌకాద ళం, ఆంధ్ర విశ్వవిద్యాలయం, జిల్లా యంత్రాంగం వేర్వేరుగా యోగా దినోత్సవాలు నిర్వహిస్తుంటాయి. ఈ కార్యక్రమాలలో మోదీ పాల్గొననున్నారు.

శ్రీవారి సేవలో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి



తిరుపతి , మే 3:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తన సతీమణితో పాటు ఇవాళ తిరుమల శ్రీవారిని విజయసాయిరెడ్డి దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా తలనీలాలు సమర్పించిన.. రాజ్యసభ మాజీ సభ్యులు విజయ్ సాయి రెడ్డి కొత్త గెటప్ లో కనిపించారు. ఇక విజయసాయిరెడ్డి రావడంతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆయనకు శాలువా కప్పి.. సన్మానించారు. విఐపి కావడంతో ఆయనకు ప్రత్యేక వసతులు కూడా ఏర్పాటు చేశారు టిటిడి అధికారులు.

ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి ఇటీవల వైసిపి పార్టీకి? రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. విజయ సాయి రెడ్డి రాజీనామా చేసిన అనంతరం రాజకీయాలకు పూర్తిగా గుడ్ బై చెప్పారు. కానీ విజయసాయి రెడ్డి ఏదో ఒక వార్త కారణంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు.

సింధు జలాలను మళ్లించే ఏ నిర్మాణమైనా పేల్చేస్తాం.. పాక్ మంత్రి వార్నింగ్

న్యూ డిల్లీ 3 (ఎక్స్ ప్రెస్ న్యూ);సింధు జలాలపై పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. సింధు ఒప్పందం ప్రకారం పాక్‌కు సంబంధించిన వాటా జలాలను మళ్లించేందుకు భారత్ చేపట్టే ఏ నిర్మాణమైనా ధ్వంసం చేస్తామని అన్నారు. జమ్ముకాశ్మీర్ లోని పహల్గామ్ ఉగ్రవాద దాడి జరిగిన కొన్ని గంటల తర్వాత, పాకిస్తాన్ వ్యవసాయ భూమిలో 80శాతంకు నీటిని అందించే సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసిన సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో పాకిస్తాన్ మంత్రి.. పరుసగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు.ఓ ఇంటర్వ్యూలో ఆసిఫ్ మాట్లాడుతూ.. పాకిస్తాన్ జలాలను మళ్లించడం తీవ్రంగా పరిగణించబడుతుందని పునరుద్ఘాటించారు. నీటిని మళ్లించడం కోసం సింధు నది పరీవాహక ప్రాంతంలో భారత్ ఆనకట్టలు నిర్మించడానికి ముందుకు వస్తే.. పాకిస్తాన్ స్పందన ఏమిటని అడగగా.. "అది పాకిస్తాన్‌పై దురాక్రమణ అవుతుంది. వారు(భారతదేశం) ఈ రకమైన నిర్మాణ ప్రయత్నం చేస్తే.. పాకిస్తాన్ ఆ నిర్మాణాన్ని ధ్వంసం చేస్తుంది" అని పేర్కొన్నారు.

ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

–ఉప్పల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

–ప్రజల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పకుండా మెడలు వంచి తీరుతాం

–బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పల్ మాజీ శాసనసభ ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్

హైదరాబాద్ మే 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం ను నిరసిస్తూబిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పల్ మాజీ శాసనసభ ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉప్పల్‌లో భారీ ర్యాలీ నిర్వహిం చారు.హైదరాబాద్ నుంచి యాదాద్రి, వరంగల్ మార్గంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉప్పల్ సమీపంలో ఆరు వరుసల ఎలివేటెడ్ కారిడార్ (ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్) నిర్మాణాన్ని ప్రారంభించింది.కానీ ఈ ప్రాజెక్టు పనుల్లో రాష్ట్ర ప్రభుత్వం సహాయనిరాకరణ కారణంగా తీవ్ర జాప్యం ఏర్పడింది. ఈ సందర్భంగా ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో, ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం నితిన్ గడ్కరీ గారు స్వయంగా మంజూరు చేసిన ప్రాజెక్టు ఇది.అంతేకాకుండా, గడ్కరీ గారే స్వయంగా వచ్చి శంకుస్థాపన చేసిన ప్రాజెక్టు కూడా ఇదే నాన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ గారు ఉప్పల్ అభివృద్ధికి రూ. 600 కోట్లు టాయించారు.కేంద్రం రూ. 600 కోట్లు ఇవ్వగా, జీహెచ్ఎంసీకి అవసరమైన స్ట్రీట్ లైట్స్, వాటర్ లైన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆరేళ్లు ఆలస్యం చేసింది. ఇది రాష్ట్ర ప్రభుత్వ సహాయనిరాకరణకు ఉదాహరణ.ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం అనుమతులు ఇచ్చే సమయంలో, భూసేకరణను 6 నెలల లోపు పూర్తి చేయాలని షరతుతో శంకుస్థాపన జరిగింది.కానీ అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పలు రంగాల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించారు కరెంట్ స్తంభాలు తొలగించడంలో జాప్యంసీవరేజ్ లైన్లు తొలగించడంలో అలసత్వంవాటర్ పైపులైన్ల విషయంలో నిర్లక్ష్యంనష్టపరిహారం చెల్లింపులో జాప్యం

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ ఈ పనులకు సహకరించలేదు.ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మెద్దునిద్ర వహిస్తూ ఉప్పల్ జంక్షన్ అభివృద్ధిలో జాప్యం చేస్తోందని విమర్శించారు..గతంలో మంత్రి కేటీఆర్‌ను నిలదీసిన తర్వాతే ఉప్పల్‌లో కొన్ని స్తంభాలు, ఇతర కట్టడాలు తొలగించబడ్డాయి.మే 5న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గారు హైదరాబాద్ వస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఒత్తిడి తెచ్చి, ఖచ్చితమైన ఆదేశాలు ఇచ్చి, ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులను వెంటనే పూర్తిచేయాల్సిన అవసరం ఉంది.ఉప్పల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించబడింది.ప్రజల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పకుండా మెడలు వంచి త

పాక్‌పై ఆర్థిక దిగ్బంధం!

పాక్ ఆర్థిక మూలాలపై దెబ్బ కొట్టేందుకు భారత్ ప్లాన్
పాక్‌ను ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో తిరిగి చేర్చడంపై చర్చలు
రుణాలు ఇవ్వకుండా ఆర్థిక సంస్థలపై ఒత్తిడికి వ్యూహం

న్యూఢిల్లీ, మే 3 (ఏక ప్రెస్ న్యూస్); : పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై దౌత్యపరమైన ఆంక్షలు విధించడమే కాకుండా దాయాది దేశాన్ని ఆర్థికపరమైన చక్రవ్యూహంలో బంధించాలని భారత్ యోచిస్తోంది. సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడే దేశాలపై ఆర్థికపరమైన ఆంక్షలను విధించే లక్ష్యంతో ఏర్పడిన ఆర్థిక కార్యావరణ టాస్క్ ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) గ్రే లిస్టులో పాకిస్థాన్‌ను తిరిగి చేర్చాలని ఒత్తిడి తీసుకురావాలని భారత్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌పై రెండు రకాలుగా ఆర్థికపరమైన ప్రతీకార చర్యలు చేపట్టాలని భారత్ యోచిస్తోంది. అందులో మొదటిది పాకిస్థాన్‌ను మళ్లీ ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో చేర్చించేలా లాబీ చేయడం. దేశంలోని ఉగ్రవాద గ్రూపులకు సరిహద్దుల అవతల నుంచి అందుతున్న ఆర్థిక సహాయాన్ని అడ్డుకోవాలన్న విస్తృతమైన వ్యూహంలో భాగంగా ఈ చర్య చేపట్టాలన్నది భారత్ ఆలోచన.

ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో పాక్‌ను చేర్చాలన్న డిమాండును ముందుకు తీసుకెళ్లాలంటే తీసుకోవలసిన చర్యల గురించి ప్రభుత్వంలో చర్చ జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. పాకిస్థాన్ గతంలో 2018 జూన్ నుంచి 2022 అక్టోబర్ వరకు ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో ఉంది. గతంలో ఈ లిస్టులో ఉన్న రోజుల్లో దేశంలోకి అక్రమ నిధుల ప్రవాహం తగ్గిందని భారత్ వాదిస్తోంది. ఇక రెండో చర్య పాకిస్థాన్‌కు రుణాలు అందచేస్తున్న బహుళ ఆర్థిక సంస్థలపై ఒత్తిడి తీసుకువచ్చి రుణాలు ఇవ్వకుండా అడ్డుకోవడం. అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు, ఆసియన్ అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ)తోసహా ప్రధాన ఆర్థిక సంస్థలతో బహిరంగ చర్చలు ప్రారంభించాలని భారత్ భావిస్తున్నట్లు తెలుస్తుంది.పాకిస్థాన్‌కు అందచేస్తున్న ఆర్థిక సహాయాన్ని పునఃసమీక్షించాలని ఆయా ఆర్థిక సంస్థలను కోరాలని భారత్ భావిస్తోంది. సీమాంతర ఉగ్రవాదాన్ని అడ్డుకోవడంలో ఘోరంగా విఫలమైనప్పటికీ పాకిస్థాన్‌కు అభివృద్ధి సాయం కొనసాగడంపై భారత్ ఆందోళన వ్యక్తం చేయనున్నట్లు తెలుస్తుంది.

రుణం అందకుండా ఒత్తిడి

ఆర్థికంగా దివాలా తీసిన పాకిస్థాన్‌కు తిరిగి పట్టాలెక్కించడానికి ఐఎంఎఫ్ 700 కోట్ల డాలర్ల(భారతీయ కరెన్సీలో రూ.59,026 కోట్లు) రుణాన్ని అందచేస్తోంది. 2024 సెప్టెంబర్‌లో విడుదలైన ఈ రుణం విడతల వారీగా పాక్ అభివృద్ధి కోసం విడుదల చేస్తోంది. పాకిస్థాన్‌ను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి 1958 నుంచి ఇప్పటివరకు 24 సార్లు ఐఎంఎఫ్ రుణం అందచేసింది. సీమాంతర ఉగ్రవాదాన్ని నిరంతరాయంగా పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌కు ఈ తరహా ఆర్థిక సహాయం అందచేయడంలోని విశ్వసనీయతను, దూరదృష్టిని భారత్ ప్రశ్నించే అవకాశం ఉంది.ఇది గాక 4,340 కోట్ల డాలర్ల(రూ.1.13 లక్షల కోట్లు) రుణాన్ని 764 పబ్లిక్‌సెక్టార్ రుణాలు, గ్రాంట్ల కింద పాకిస్థాన్‌కు అందచేయడానికి ఆసియన్ అభివృద్ధి బ్యాంకు ముందుకువచ్చింది. వీటితోపాటు 365 ప్రాజెక్టుల కోసం 4,970 కోట్ల డాలర్ల రుణాన్ని(రూ.4.19 లక్షల కోట్లు) అందచేస్తామని ప్రపంచ బ్యాంకు పాకిస్థాన్‌కు వాగ్దానం చేసింది. ఈ ఆర్థిక సంస్థలపై ఒత్తిడి తీసుకువచ్చి పాకిస్థాన్‌కు రుణాలు ఇవ్వకుండా అడ్డుకోవాలని భారత్ యోచిస్తున్నట్లు ఆ అధికారి తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలించకుండా తనిఖీలు చేపట్టాలి : జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి

హైదరాబాద్, మే 3:అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని హుస్సేల్లి గ్రామ శివారులోని తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని చెక్‌పోస్టును ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా ఆర్డీవో రాంరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలపై కర్ణాటకకు ఇసుక తరలిస్తున్న లారీలపై నిఘా పెట్టాలని ఆదేశించారు. సరిహద్దు చెక్‌పోస్టు వద్ద రెవెన్యూ, పోలీసుల సహకారంతో 24 గంటల పాటు తనిఖీలు చేపట్టాలని సూచించారు

. ప్రభుత్వ అనుమతితో లారీల్లో ఇసుక తీసుకెళ్తున్నారా..? లేక ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారా అనేది క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఇసుక తరలించే వాహనాల డ్రైవర్లు తప్పనిసరిగా వే బిల్‌తో పాటు అన్ని అనుమతులకు సంబంధించిన పత్రాలను కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలించే లారీలను పట్టుకుని సీజ్ కేసి కేసులను నమోదు చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టు వద్దనే పట్టుకున్న ఇసుకను డంపింగ్ చేయాలన్నారు. ప్రతి రోజు మండలంలోని పలు ప్రాంతాల మీదుగా కర్ణాటక తదితర ప్రాంతాలకు ఇసుక లోడ్‌తో వెళ్లే వాహనాలను తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అప్పుడు యాదాద్రి జిల్లా కలెక్టర్ భుజం తడితే.. ఇప్పుడు డిస్ట్రిక్షన్ లో పాస్

-యాదాద్రి జిల్లా కలెక్టర్ ఇంటి తలుపు తట్టే కార్యక్రమంతో వెలుగులు
-విద్యార్థి భరత్ చంద్ర ఇంటికి కలెక్టర్ మరోసారి
-టెన్త్ డిస్ట్రిక్షన్ లో పాస్ కావడంతో అభినందనలు
-తల్లికి సత్కారం.. ఆర్థిక సాయం

యాదాద్రి , మే 3: జీవితంలో స్థిరపడే వరకు సహాయం అందిస్తానని తాను దత్తత తీసుకున్న 10వ తరగతి విద్యార్థి కుటుంబానికి యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు భరోసానిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం శేరిగూడెం గ్రామానికి చెందిన భరత్ చంద్ర చారి ఇంటికి జిల్లా కలెక్టర్ నేడు స్వయంగా వెళ్లారు.

ఇది ఇలా ఉంటే పదవ తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన తెల్లవారుజామునే విద్యార్థి ఇంటి తలుపు తట్టే కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ శేరిగూడం గ్రామానికి చెందిన భరత్ చంద్ర చారి ఇంటికి ఈ ఏడాది జనవరిలో వెళ్లిన విషయం తెలిసింది. ఆ సమయంలో భరత్ చంద్ర చారి కుటుంబ పరిస్థితిని చూసి చలించిన జిల్లా కలెక్టర్ పదో తరగతి పూర్తయ్యే వరకు తాను సాయం అందిస్తానని బాగా చదివి మంచి మార్కులు సాధించాలని ప్రోత్సహించారు.

రాష్ట్ర స్థాయిలో అన్నమాచార్య కీర్తనల పోటీలు నిర్వహించడం అభినందనీయం - సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

హైదరాబాద్, మే 3:రాష్ట్ర స్థాయి అన్నమాచార్య సంకీర్తనల పోటీలు పెద్ద ఎత్తున నిర్వహించడం హర్షణీయమని, నిర్వాహకులకు అభినందనలు తెలియజేయడం కరీంనగర్ వాసిగా గర్వపడుతున్నానని సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. సప్తగిరి కాలనీ శ్రీ కోదండ రామాలయ ప్రాగణంలో నిర్వహించిన సందర్భంగా అన్నమాచార్య కీర్తనల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. లీడ్ ఇండియా నేషనల్ క్లబ్, స్వరమాధురి సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. సభాధ్యక్షత వహించిన లీడ్ ఇండియా ఫౌండేషన్ అధ్యక్షులు కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీల్లో 10 జిల్లాల నుంచి 200 మంది పాల్గొన్నారు. ఇందులో 7 ఏండ్ల నుండి 75 ఏండ్ల వయసున్న వారు కీర్తనలు పాడి ప్రేక్షకుల మన్ననలు పొందారని అన్నారు. స్వరమాధురి అధ్యక్షులు కె బి శర్మ మాట్లాడుతూ సంగీత సాహిత్యాల కలయిక ఒక అపూర్వ అనుభూతిని కలుగజేస్తుందని అన్నారు. గౌరవ అతిథి డా: గండ్ర లక్ష్మణ్ రావు మాట్లాడుతూ 33 వేల సంకీర్తనలు అలవోకగా రచించిన అన్నమయ్య విష్ణుమూర్తి అంశగా జన్మించడం, సరళ భాషలో స్వామి వారిని సంకీర్తన రూపంలో కొలుచుకోవడం మనందరికీ ఆదర్శమన్నారు. అన్నమయ్య కీర్తనల పోటీలకు సౌజన్య ప్రదాతలుగా ఏ జె అనంతరావు, ఇనుగుర్తి రవేష్, వడకాపురం జగదీశ్వరాచారి, పోరెడ్డి శ్రీహరి రెడ్డి, జాలి రవీందర్ రెడ్డి, డా: శ్రీలత మోహనరెడ్డి, సాయి వెంకటరమణ రైస్ మిల్ వారు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎస్ కె అనంతాచార్య నేతృత్వంలో పోటీలు సజావుగా జరిగాయి. నాలుగు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రం, బాలాజీ కండువాలను అందజేశారు. ఈ కీర్తనల పోటీలకు న్యాయనిర్ణేతగా కెప్టెన్ నరహరి శర్మ, గుండి జగదీశ్వర శర్మ, సుకృతి మేఘమాల, బ్రహ్మాండం శ్రీ కుమారి సేవలు అందించారు.

సబ్ జూనియర్స్ విభాగం: ప్రథమ బహుమతి కోటిరెడ్డి నిధి చంద్రిక, ద్వితీయ బహుమతి డి భవిష, తృతీయ బహుమతి బండారి అనిరుద్ గెలుచుకోగా జూనియర్స్ విభాగం అకినపల్లి అభిరామ్, ఎడవెల్లి సింధుశ్రీ గెలుచుకున్నారు. సీనియర్స్ విభాగంలో మొదటి మూడు బహుమతులను కె బాస్వంత్ శర్మ, కాచేది సుమ్మితా, బెజ్జంకి జ్యోతి గెలుచుకున్నారు. సూపర్ సీనియర్స్ విభాగంలో తోట సుదర్శన్, ముద్దసాని శంకర్, వడ్లూరి సుధాకర్ గెలుచుకున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
-కాంగ్రెస్ పార్టీలో జయవరం వాసుల చేరికలు



రాజన్న సిరిసిల్ల, మే 3: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ రూరల్ మండలం జయవరం గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరిక అయ్యారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీ లోకి ఆహ్వానించారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి నేడు కాంగ్రెస్ పార్టీలో పలువురు చేయడం జరిగిందన్నారు.దేశవ్యాప్తంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని గమనిస్తూ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని వాళ్లు రావడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ ద్వారా పేద ప్రజలకు సేవ చేయాలని పార్టీలో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూ ఉందన్నారు. నేటి నుంచి వారి యువ క్షేమాలు కాంగ్రెస్ పార్టీ చూస్తోందని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు చేరవేయాలన్నారు.

బలహీన వర్గాలకు కుల గణన జరపాలని రాహుల్ గాంధీ ఇచ్చిన సూచన మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కుల గణన చేసి దేశానికి ఒక రోల్ మోడల్ గా నిలిచారని అన్నారు.

బీసీలకు రాజకీయంగా విద్య, ఉద్యోగ పరంగా రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో చట్టాన్ని చేయడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే విధంగా ముఖ్యమంత్రి స్వయంగా ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద దీక్షలో కూర్చున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి క్యాబినెట్లో ఆమోదింపజేసి దేశవ్యాప్తంగా కులగణన చేస్తామని ప్రకటించారని, ఇది కాంగ్రెస్ పార్టీ విజయం అన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయడం జరుగుతుందని, మొన్నటి రోజున నాగారం వెళ్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించడం జరిగిందని, చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుదన్నారు.

గత బి.ఆర్.ఎస్. ప్రభుత్వం కంటే ఎన్నో రెట్లు వేగవంతంగా కొనుగోలుచేస్తున్నామని, మొన్నటి రోజు ఇతర పార్టీ నాయకులు రోడ్డు ఎక్కి ధర్నా చేయడం హాస్యాస్పదం అన్నారు.

మానవతా దృక్పథంతో జిల్లా కలెక్టర్ ఆర్థిక చేయూత

-కలెక్టర్లు కృతజ్ఞతలు తెలిపిన ఆయా కుటుంబాలు

రాజన్న సిరిసిల్ల, మే 3: (నేటినిజం ప్రతినిధి): అనారోగ్య, ఆర్థిక కారణాలతో ఇబ్బంది పడుతున్న మూడు కుటుంబాలకు కలెక్టర్ ఆర్థిక చేయూత అందించారు. అనారోగ్య, ఆర్థిక కారణాలతో తాము ఇబ్బంది పడుతున్నామని, తమను ఆదుకోవాలని, ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తంగళ్ళపల్లి మండలం రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన దాసరి మల్లవ్వ, కోనరావుపేట మండలం కొలనూర్ గ్రామానికి చెందిన కుమ్మరికుంట కళావతి, వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన సింగం నర్సయ్య విన్నవించారు.

ఆయా కుటుంబాల స్థితిగతులు చూసి చలించిన కలెక్టర్ ... వెంటనే ఆర్థిక సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో కుటుంబానికి రూ. 25 వేల చొప్పున ఆర్థిక సహాయం చెక్కులను శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్ లో ఆయా కుటుంబాల బాధ్యులకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అందజేశారు. వారంలోగానే తమకు ఆర్థిక సహాయం అందించిన కలెక్టర్ కు ఆయా కుటుంబాల బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యార్థులు శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలి

-తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి
-జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఏప్రిల్ మే 3: (నేటినిజం ప్రతినిధి) జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వివిధ ప్రైవేట్ విద్యాసంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇస్తున్న శిక్షణలను సద్వినియోగం చేసుకుని రాణించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అల్ఫోర్స్ విద్యా సంస్థ సహకారంతో రామడుగు మండలం వెదిర గ్రామంలోని అల్ఫోర్స్ పాఠశాలలో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒలంపియాడ్ లో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో మెరిట్ సాధించిన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చే విధంగా ప్రైవేటు యాజమాన్యాలతో గతంలో ఒప్పందం కుదుర్చుకున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సైతం అన్ని రంగాల్లోనూ రాణించాలన్న ఆలోచనతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఇందులో భాగంగా అల్ఫోర్స్ విద్యాసంస్థ ప్రభుత్వ విద్యార్థులకు ఒలంపియాడ్ లో శిక్షణ ఇస్తోందని తెలిపారు. గత నెల 24 నుండి శిక్షణ ప్రారంభమైందని తెలిపారు. విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించి శిక్షణకు పంపించాలని, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో టాలెంట్ ఉందని అన్నారు. వారికి అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించాలని తెలిపారు. విద్యార్థి దశ నుండే వివిధ పోటీ పరీక్షలకు హాజరవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత విద్యపై అవగాహన వస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, తాసిల్దార్ రాజేశ్వరి, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పదిలో ప్రతిభ చూపిన విద్యార్థి జీవన్ కు ప్రభుత్వ విప్ అభినందన

రాజన్న సిరిసిల్ల, మే 3: (నేటి నిజం ప్రతినిధి): పదవ తరగతి పరీక్షల్లో తమ ప్రతిభ కనబరిచి 585/600 మార్కులు సాధించిన వేములవాడ పట్టణానికి చెందిన ×కనికరపు జీవన్ ను శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్× తన క్యాంపు కార్యాలయంలో బొకే అందించి, శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు .ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ కష్టపడితే ఎలాంటి లక్ష్యానికైనా చేరుకోవచ్చునని, జీవితంలో ఉన్నత స్థానంలో నిల్వాలంటే పట్టుదలతో చదవాలంటూ విద్యార్థులన ఉత్సాహపరిచారు.చదువుల్లో ప్రతి విద్యార్థి రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ ఉన్నారు...

చదువుదాం..ఆడుదాం.. ఎదుగుదాం : జీవి కోటిరెడ్డి

ఖమ్మం, మే 3:క్రీడలు మానసిక ఉల్లాసానికి , శారీరక దారుఢ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయని, పిల్లల్లో క్రీడా స్ఫూర్తితో పాటు వ్యక్తిగత వికాసానికి కూడా ఉపయోగకరంగా ఉంటుందని కొత్తగూడెం ఏరియా ఎస్ఓటు జీఎం జీవి కోటిరెడ్డి అన్నారు. శనివారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ జడ్పీహెచ్ఎస్‌లో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభించి మాట్లాడారు. శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ వి.మల్లికార్జునరావు, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ.రజాక్, డీజీఎం(పర్సనల్) బి.శివకేశవరావు, హానర్‌బుల్ సెక్రెటరీ ఎండీ.ఖలీల్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జె.రాంబాబు, స్పోర్ట్స్ మెంబర్ సీహెచ్.సాగర్, కె.శ్రీనివాస్ రెడ్డి, జడ్పీహెచ్ఎస్ రుద్రంపూర్ ప్రిన్సిపాల్ బాలాజీ, స్కూల్ పీఈటీ కవిత, శిక్షకులు, పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాబా కల్యాణి కోర్టులో మోసం చేశాడు: సోదరి

హైదరాబాద్, మే 3:పద్మభూషణ్ అవార్డు గ్రహీత బాబా కల్యాణి సోదరి ఆయన కోర్టులో మోసం చేశాడని ఆరోపించింది. ఈ తోబుట్టువులు ఇద్దరు వారి తల్లి సులోచన కల్యాణి యొక్క సమాధికి సంబంధించి కోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నారు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో, కేశవ్ నగర్, పూణెలోని ప్లాట్ లో ఉన్న తమ తండ్రి సమాధికి పక్కనే తమ తల్లికి కూడా సమాధి నిర్మించేందుకు అనుమతించాలని కోరుతూ, ప్రముఖ పారిశ్రామికవేత్త మరియు భారత్ ఫోర్జ్ చెయిర్మన్ బాబా కల్యాణి పై సుగంధ ఒక దావా వేశారు. సులోచన కల్యాణి సోదరి ఫిబ్రవరి 2023లో మరణించారు. తమ తల్లి మరణించిన వెంటనే, ఆమె జ్ఞాపకార్థం ఒక సమాధిని కేశవ్ నగర్, పూణెలో ఉన్న ప్లాట్ లోని తమ తండ్రి సమాధి పక్కనే నిర్మించాలని తాను బాబాను కోరింది. కాని బాబా ఆమె అస్తికలను ఒక నదిలో కలపాలని అనుకున్నారు. తల్లి రెండవ వర్ధంతి సమీపిస్తుండగా, సమాధిని నిర్మించమని సుగంధ బాబాకు వ్రాసినప్పుడు, ఆయన సులోచన తన కుమారుడు గౌరిశంకర్ తో ఉంటున్న ఆ ప్లాట్ లోనే నిర్మించమని చెప్పారు. కాని కేశవ్ నగర్ ప్లాట్ లో ఉన్న తన భర్త సమాధి పక్కనే తన సమాధి కూడా నిర్మించబడాలనేది తన తల్లి కోరిక అని సుగంధ పట్టుబట్టారు.పద్మ భూషణ్ అవార్డు గ్రహీత బాబా కల్యాణి నిరాకరించడముతో, సుగంధ పూణె కోర్టును ఆశ్రయించి ఈ సంవత్సరం ఫిబ్రవరిలో ఒక దావా వేసింది. ఈ కేసులో అనేక మలుపులు ఉన్నాయి. ముందుగా బాబా తాను తన తోబుట్టువుల ఇష్టప్రకారం సమాధిని నిర్మించుటకు సిద్ధంగా ఉన్నారు. సమావేశము సమయములో, ఆయన ఇప్పటికే వారి తల్లి జ్ఞాపకార్థం కాశిలో ఒక శివలింగ ప్రతిష్ఠ చేశానని సుగంధకు చెప్పారు. సుగంధ ఆ మాటానికి వెళ్ళి, అక్కడ కేవలం ఒక చిన్న శివలింగము ఉండడము, సమాధి వంటిది ఏది అక్కడ లేకపోవడం చూసి కలత చెందింది. తదుపరి కోర్టు విచారణలో సుగంధ సమాధిని కట్టాలని అనుకుంటున్న ప్లాట్ అతనిది కాదని, ఇవ్వలేనని పేర్కొన్నారు. బాబా వైఖరిని తప్పుగా తీసుకున్న సుగంధ "ఈ గౌరవనీయ న్యాయస్థానాన్ని తప్పుదోవపట్టించడము మరియు ఇటువంటి తప్పు ప్రకటనలు చేయడములో ఆయనకు ఎలాంటి సంకోచం లేదని స్పష్టం అవుతోంది" అని ఆరోపిస్తూ ఒక అఫిడవిట్ ఫైల్ చేసింది. ఈ గౌరవనీయ న్యాయస్థానాన్ని మోసం చేసే ప్రయత్నం చేసినందుకు బాబాకు వ్యతిరేకంగా "తీవ్రమైన శిక్షా చర్య" తీసుకోవాలని ఆమె న్యాయస్థానాని కోరింది.

రక్తదానం చేసిన బీజేపీ నేత

రాజన్న సిరిసిల్ల, మే 3: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని ప్రైవేట్ హాస్పిటల్ రక్తహీనతతో బాధపడుతున్న వ్యక్తికి వేములవాడ రూరల్ మండలం బిజెపి అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ రక్తదానం చేసి ప్రాణాలను కాపాడారు. పరమేష్ మాట్లాడుతూ ఇప్పటివరకు 16 సార్లు రక్తదానం రెండుసార్లు ప్లాస్మా దానం ఇవ్వడం జరిగింది అని, ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు.

రక్తదానం చేసిన పరమేశ్ ను పలువురు అభినందించారు.

తెలుగు సారస్వత వైభవం, కర్నూలు వారి ఆహ్వానము
ఆచార్య గుబ్బా బాలస్వామి గారు రచించిన
దేవుడా...! శతకం పుస్తకావిష్కరణ
తేది : 04-05-2025, ఆదివారం సాయంత్రం గం. 5:30 ని.లకు
వేదిక : టీ.జి.వి. కళాక్షేత్రం, సి.క్యాంపు, కర్నూలు
సభాధ్యక్షులు : శ్రీ గారెడ్డి హరిశ్చంద్రారెడ్డి గారు
పుస్తకావిష్కరణ : కళారత్న శ్రీ పత్తిఓబులయ్య గారు
ముఖ్య అతిథి : కందకవి సార్వభౌమ శ్రీ రాధశ్రీ గారు
పుస్తక సమీక్ష : శ్రీమతి కర్నాటి చంద్రమౌళి గారు
కవులకు, రచయితలకు, తెలుగు భాషాభిమానులకు ఇదే మా ఆహ్వానం
ఆహ్వానించువారు
బి. రామకృష్ణారెడ్డి
ప్రధాన కార్యదర్శి, తెలుగు సారస్వత వైభవం
గారెడ్డి హరిశ్చంద్రారెడ్డి
అధ్యక్షులు, తెలుగు సారస్వత వైభవం

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.